క్లుప్తంగా

నేడు ప్రపంచ ప్రార్థనా దినోత్సవం

చిలకలూరిపేటటౌన్: ప్రపంచ శాంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ప్రపంచ ప్రార్థనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాస్టర్ ఎంఎస్ మూర్తి చెప్పారు. శనివారం పట్టణంలోని తూర్పుమాలపల్లిలోని జీసెస్ వర్‌షిప్ సెంటర్‌లో నిర్వహించిన ప్రపంచ ప్రార్థనా దినోత్సవ సందర్భంగా సిద్ధపాటు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ప్రతిఒక్కరూ ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న పాత మార్కెట్ యార్డులో జరిగే నియోజకవర్గస్థాయి ప్రార్థనలో పాల్గొనాలన్నారు. సాయంత్రం 6 గంటలకు మొదలయ్యే ఈ కార్యక్రమంలో పట్టణం, యడ్లపాడు, నాదెండ్ల, చిలకలూరిపేట మండలాల్లోని అన్ని పాస్టర్స్ ఫెలోషిప్ సంఘాలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు దైవసేవలకు పాల్గొన్నారు.

20న ఢిల్లీ పబ్లిక్ స్కూలు ప్రారంభోత్సవం

నరసరావుపేట: మండలంలోని కేసానుపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూలును ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవం చేయనున్నట్లు స్కూలు కార్యదర్శి డాక్టర్ నాగోతు ప్రకాశరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ముఖ్య అతిథులుగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, న్యాయకోవిదులు జస్టిస్ నూతలపాటి వెంకట రమణ, గౌరవ అతిథిగా ఏపీ హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు హాజరవుతారన్నారు. ఐదెకరాల స్థలంలో సీబీఎస్‌ఇ సిలబస్‌తో నర్సరీ నుంచి ఎనిమిదవ తరగతి వరకు ఆంగ్ల మీడియంలో విద్యాబోధన ఉంటుందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు క్రీడలు, యోగా తదితర కార్యకలాపాల్లో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు రెండు నుంచి ఎనిమిదవ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు, స్కాలర్‌షిప్ టెస్టు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ టెస్టులో ప్రతిభ కనబర్చిన వారికి నూతలపాటి వెంకటరమణ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారని, విద్యార్థినీ విద్యార్థులు, తల్లితండ్రులు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోయిన సెల్‌ఫోన్లు రికవరీ



చిలకలూరిపేట టౌన్: చోరీకు గురైన సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందించారు. అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో పట్టణానికి చెందిన పలువురు తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అర్బన్ సీఐ పి.రమేష్ దర్యాప్తులో పోయిన సెల్‌ఫోన్లను రికవరీ చేసి శనివారం బాధితులకు అందజేశారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



ముప్పాళ్ల: జాతీయ డెంగీ నివారణ కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్లలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సత్తెనపల్లి మలేరియా సబ్‌యూనిట్ అధికారి డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, ఇంట్లోని వ్యర్థాలను కాల్వలో వేయరాదని, జ్వరం వస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. ర్యాలీలో సూపర్‌వైజర్లు పీటర్‌డేనియల్ పాల్గొన్నారు.

21న ఆలయ స్టాల్స్ నిర్వహణ హక్కుల వేలం

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అటవీలో స్వయంభు సత్తెమ్మ తల్లి దేవాలయం వద్ద స్టాల్స్ నిర్వహణ హక్కుల కోసం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి గాదె రామ కోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, పూజా ద్రవ్యములు అమ్ముకునేందుకు ధరావత్తుగా రూ.50 వేలు, క్యాంటిన్, కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు రూ.50 వేలు, కొబ్బరి చిప్పలు, భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరెలు, జాకెట్‌ముక్కలు పోగు చేసుకునే హక్కుకు రూ.30 వేలు, టెంట్ సామాన్లు, వంటసామగ్రి, గ్యాస్ సిలెండర్స్, వంట చెరుకు అద్దెకు ఇచ్చుకునేందుకు రూ.30 వేలు, అమ్మ ఫొటోలు, చేతికికట్టుకునే దారాలు, అమ్మవారి జెండాలు, ఫ్రూట్స్ అమ్ముకునేందుకు రూ.20 వేలు, భక్తులు సమర్పించిన తలనీలాలు పోగుచేసుకునేందుకు రూ.20 వేలు, ప్రసాదాలు విక్రయించుకునేందుకు రూ.20 వేలు ముందుగా ధరఖావత్తు సొమ్ముగా చెల్లించవలసి ఉంటుందన్నారు. పాటలో పాల్గొన దలచినవారు ధరావత్తు సొమ్మును నగదు రూపములో తీసుకుని రావలసి ఉంటుందన్నారు. వివరాలకు 9182960378 సంప్రదించాలని కోరారు.

చిలకలూరిపేటలో ఓటేయని వారు 31,432

- ఈవీఎంల ద్వారా పోలైన ఓట్లు 1,92,649
- పోస్టల్ ఓట్లు 2,409
- హోం ఓటింగ్ 156, వెరసి మొత్తం పోలైన ఓట్లు 1,95,214
- ఇది 86.13 శాతానికి సమానం



ఓట్లు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

చిలకలూరిపేట: ప్రజల్లో ఎన్నికల పట్ల పెరిగిన అవగాహన, ఎన్నికల కమిషన్ ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన ప్రాధాన్యత గురించి నిర్వహిస్తున్న ప్రచారం... కారణాలు ఏవైనా ఏ ఎన్నికలకు, ఆ ఎన్నికలకు చిలకలూరిపేట నియోజకవర్గంలో పోలయ్యే ఓట్ల శాతం పెరుగుతూనే వస్తున్నది. 2024లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లోనూ అదే వైఖరి కొనసాగింది. అయినప్పటికీ కొంతమంది మాత్రం ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఎందుకో నిర్లిప్తత వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు వినియోగించుకోని సంఖ్య 31,432 గా తేలింది.

ఓట్ల వివరాలు ఇలా...

నియోజకవర్గంలోని చిలకలూరిపేట పట్టణ పరిధిలో 86,840 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 40,754, మహిళలు 46,064 మంది, ఇతరులు 22 మంది ఉన్నారు. చిలకలూరిపేట మండల పరిధిలో మొత్తం ఓట్లు 42,256 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 20,349, మహిళలు 21,907 మంది ఉన్నారు. నాదెండ్ల మండలంలో మొత్తం ఓట్లు 53,169 ఉండగా పురుషులు 25,896, మహిళలు 27,246 మంది, ఇతరులు 27 మంది ఉన్నారు. యడ్లపాడు మండలంలో మొత్తం ఓట్లు 44,381 మంది ఉండగా, పురుషులు 21,393, మహిళలు 22,988 మంది ఉన్నారు.

పోలైన ఓట్ల వివరాలు...

చిలకలూరిపేట పట్టణ పరిధిలో మొత్తం 67,989 ఓట్లు పోల్ కాగా, ఇందులో పురుషులు 32,294, మహిళలు 35,683, ఇతరులు 12 మంది. చిలకలూరిపేట మండలం మొత్తం పోలైన ఓట్లు 37,991, ఇందులో పురుషులు 18,363 మంది, మహిళలు 19,628 మంది.

నాదెండ్ల మండలంలో మొత్తం పోలైన ఓట్లు 46,961 ఇందులో పురుషులు 22,971, మహిళలు 23,970, ఇతరులు 20 మంది. యడ్లపాడు మండలం పోలైన మొత్తం ఓట్లు 39,708 ఇందులో పురుషులు 19,134 మంది, మహిళలు 20,574 మంది ఉన్నారు. ఇక నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎం ద్వారా పోలైన మొత్తం ఓట్లు 1,92,649 ఇందులో పురుషులు 92,762 మంది, మహిళలు 99,855 మంది, ఇతరులు 32 మంది. ఈవీఎంల ద్వారా పోలైన మొత్తం ఓట్ల శాతం 84.99 శాతానికి సమానం కాగా, పోస్టల్ ఓట్లు 2,409 పోల్ కాగా, హోం ఓటింగ్ 156 పోలయ్యాయి. వెరసి నియోజకవర్గం నుంచి 1,95,214 ఓట్లు పోలయ్యాయి. ఇది 86.13 శాతానికి సమానం.




ఓటు వేసేందుకు తరలివచ్చిన ఓటర్లు

2004 నుంచి...

నియోజకవర్గంలో 2004 ఎన్నికలో 73.70శాతం, 2009 ఎన్నికల్లో 81.89 శాతం, 2014 ఎన్నికల్లో 85.98 శాతం, 2019 ఎన్నికల్లో 85.51 శాతం నమోదు కాగా, 2024 ప్రస్తుత ఎన్నికల్లో 86.13 శాతం నమోదు కావడం విశేషం.

వైభవంగా వాసవీ అమ్మవారి జయంతి



గాజుల అలంకరణలో వాసవీ అమ్మవారు



రొంపిచర్లలో దర్శనమిచ్చిన అమ్మవారు

నరసరావుపేట ఈస్ట్: శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. సత్తెనపల్లి రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని గాజులతో అలంకరించారు. 102 మంది ముత్తయిదువులచే అమ్మవారి కలశాలను అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆలయంలో నిర్వహించిన కుంకమ అర్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘాలు, ఆర్యవైశ్య ప్రముఖులు అమ్మవారి నగరోత్సవంలో పాల్గొని ఆశీస్సులు పొందారు. సాయంత్రం అమ్మవారి అలంకరణతో దీపోత్సవం జరిపారు.

ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తమాసు వెంకట మల్లారావు, కార్యదర్శి మిరియాల నాగప్రసాద రావు, కోశాధికారి కె. కాశీ విశ్వనాథరావు, శ్రీ వాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొత్తూరి కిషోర్, యక్కల వేదాద్రి తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శనివారం అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారు కారణజన్మురాలని, శక్తిస్వరూపిణి, కామితవరదాత, ఆత్మాభిమానానికి, త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనం. రాజరికపు అరాచకత్వాన్ని అహింసాయుతంగా ధిక్కరించిన ధీరవనితగా విశ్వసించిన వారికి మోక్షాన్ని ఇచ్చే అపర పార్వతి అమ్మవారని భక్తుల నమ్మకం. అమ్మవారి జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు అనంతరం సహస్ర కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కోదండ రామా దీక్షితులు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు గొడవర్తి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మేజర్ పంచాయతీలో అధ్వాన పారిశుద్ధ్యం

ఇళ్లలోకి చేరుతున్న మురుగునీరు



గణపవరం సినిమాహాల్ రోడ్డులో మురుగుతో నిండిన సైడు కాలువ

నాదెండ్ల: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తాయి. పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించకపోవడంతో కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి వర్షపు నీరు పారక రోడ్డుపై చేరి వీధులను ముంచెత్తుతోంది. వర్షపునీటితో పాటూ మురుగునీరు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరుతోంది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణలో తీవ్ర అలసత్వం చూపుతున్నారని మండిపడుతున్నారు. వర్షాకాలం సమీపించటంతో ఇప్పటికైనా అధికారులు పటిష్ట చర్యలు తీసుకుని మురుగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మారుతిబాబును వివరణ కోరగా, కాలువల్లో చెత్త, పూడిక తీసేందుకు సౌకర్యం లేకుండా గృహ యజమానులు, దుకాణదారులు కాలువలను పూర్తిగా బండరాళ్లతో మూసివేయటం సమస్యకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. త్వరలో కాలువలు మూసివేసిన గృహ యజమానులు, దుకాణదారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. పొక్లెయినర్ సాయంతో మురుగుకాలువలు శుభ్రం చేసి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. శనివారం సచివాలయ సిబ్బందితో కలిసి సమస్యలు నెలకొన్న ప్రాంతాల్లో పర్యటించారు.

స్నేహానికన్న మిన్న లోకాన లేదురా!



జగ్గాపురం జెడ్పీ హైస్కూల్లో 1987 నుంచి 1992 వరకు చదివిన విద్యార్థులు

జగ్గాపురం జెడ్పీహైస్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

యడ్లపాడు: తాము చదివిన పాఠశాలలో సుమారు మూడున్నర దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు. ఆత్మీయతతో కూడిన పలకరింపులు, అనుబంధాలు పంచే పరిచయాలు, చిన్ననాటి మధురస్మృతులను నెమరువేసుకుంటూ వారు రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. యడ్లపాడు మండలంలోని జగ్గాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987లో ఆరో తరగతిలో చేరి 1992లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది.

ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యావిధానంలో నాడు–నేడు వచ్చిన మార్పులు–వసతులు, ఉపాధ్యాయులు–విద్యార్థుల ప్రవర్తన తీరుపై విశ్రాంత హెచ్ఎం అబ్బరాజు సాంబశివరావు, తెలుగు టీచర్ బత్తుల నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు విశదీకరించారు. పూర్వ హెచ్ఎం ఆన్‌లైన్ ద్వారా పెళ్లూరు వెంకటేశ్వరరావు చక్కని సందేశంతో పాటు దీవెనలు అందజేశారు. పూర్వవిద్యార్థుల్లో వివిధ హోదాల్లో పనిచేసిన రిటైర్డ్ హెచ్ఎంలు, టీచర్లు, మాజీ ఎంపీపీ వలేరు రాజారావు వంటి వారిని ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో పుల్లగూర శ్యాంబాబు, జరుగుల శివరామకృష్ణ, పిల్లూరి సీతారామరాజు, తులసి రామకృష్ణ, దప్పలపాడు మహేశ్వరరావు, తుమ్మలగుంట విజయ సామ్యూల్, అన్నలదాసు ఆనందరావు, గుత్తా కాళిదాస్, పాఠశాల ప్రస్తుత హెచ్ఎం ఉషశ్రీ, దావల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో నేల సారవంతం

- మొక్కలకు అవసరమైన పోషకాల లభ్యత
- సాగుకు సరైన సమయం



సాగు చేసిన జీలుగ పంట

సత్తెనపల్లి: వరి సాగుకు ముందు పొలాల్లో పచ్చిరొట్ట వేయడం నేలకు ఎంతో మేలు చేస్తుంది. భూముల్లో సేంద్రియ కర్బణం పెరిగి పంట దిగుబడులు పెంచుకోవచ్చు. అధిక మోతాదులో వేసే రసాయనక ఎరువులతో భూములు సారం కోల్పోతాయి. పచ్చి రొట్ట పైర్ల సాగుతో పెట్టుబడులు తగ్గడమే కాకుండా పంట దిగుబడులను పెంచు కోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. భూమిని సారవంతం చేసుకోవడానికి వరి పంట వేసే పొలంలో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగలు, పిల్లి పెసర, జనుము పంటలను వేసి పూత సమయంలో కలియ దున్నడం వలన నేల సారవంతమై అధిక దిగుబడులు సాధించడానికి దోహదం చేస్తాయి. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలకు ఇప్పటికే ఈ విత్తనాలు వచ్చాయి. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా డి- క్రిష్ దరఖాస్తులో రిజిస్ట్రేషన్ చేయించుకొని రైతు వాటా నగదు చెల్లిస్తే ఏపీ సీడ్స్ ద్వారా నాణ్యమైన విత్తనాలు పొందవచ్చు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలకు జీలుగా 948 క్వింటాళ్లు, జనుము 574 క్వింటాళ్లు, పిల్లి పెసర 581 క్వింటాళ్లు, మొత్తం 2,103 క్వింటాళ్లు విత్తనాలు అవసరమని ప్రతి పాదనలు పంపారు. జీలుగా కిలో రూ.88 అమ్ముతుండగా 50 శాతం సబ్సిడీతో రూ.44 కు, పిల్లి పెసర కిలో రూ.134 ఉండగా 50 శాతం సబ్సిడీతో రూ.67కు, జనుము కిలో రూ.88 ఉండగా 50 శాతం సబ్సిడీతో రూ.44 రైతులకు అందజేయనున్నారు. జనుము, జీలుగ, పిల్లి పెసర తదితర రకాలను ఖరీఫ్, రబీకి మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి ఖరీఫ్ పంట వేసేముందు భూమిలో కలియదున్నాలి.

వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు

- సస్యరక్షణ చర్యలతో నశించనున్న క్రిమికీటకాలు
- పొలాల్లో గొర్రెలమంద కట్టడంతో మేలు
- కలుపు మొక్కల వేర్లు పెకలించాలి
- వాన నీటిని ఎక్కడికెక్కడ భూమిలో ఇంకేలా చేయాలి
- భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్న వ్యవసాయ అధికారులు



దుక్కులు చేస్తున్న రైతు

యడ్లపాడు: ఖరీఫ్ సీజన్‌కు మే నెల నుంచే సమాయత్తం కావాల్సిన అవసరం ఉంది. ఏ పంట వేయాలన్నా ముందుగా దుక్కి దున్నాల్సిందే. విత్తేందుకు పొలాన్ని అనుకూలంగా సిద్ధం చేసుకోవాలి. పంట కోతల తరువాత మళ్లీ వర్షాకాలంలో వర్షాలు కురిసేంత వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారుతాయి. దుక్కి చేయకుండా వదిలేయడం వల్ల భూమి చీడపీడల ఆవాసంగా మారి సత్తువ కోల్పోతుంది. తొలకరితో మొదలయ్యే ఖరీఫ్‌కు ముందే సమగ్ర సస్యరక్షణ పద్ధతుల్లో భాగంగా వేసవిలో లోతు దుక్కులను చేసుకోవాలి. ముడిపోషకాల లోపం ఏర్పడి, తర్వాతి పంటకు భారీగా ఎరువులు వేయాల్సి వస్తుంది. కాబట్టే రైతులు లోతు దుక్కుల మీద దృష్టి పెట్టాలి. రబీ పంటలు కోసిన తర్వాత తేమ ఉన్నప్పుడు వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. వర్షాలకు ముందు భూమిని దున్నడం వలన తొలకరి వర్షాలు పడగానే నీరు నేలలోకి ఇంకుతుంది. ఇలా చేయడం వలన పురుగు మందుల వ్యయం, వాతావారణ కాలుష్యం తగ్గుతుంది. వీటితో పాటు పంట అధిక దిగుబడులను సాధించుకోవచ్చు. జూన్ నుంచి ఖరీఫ్ –2024 ప్రారంభం కానుంది. ఇటీవల కురిసిన వర్షాల ఆధారంగా వేసవి దుక్కులు మొదలు పెట్టుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పల్నాడు జిల్లాలో 3.15 లక్షల హెక్టార్ల వ్యవసాయ, ఉద్యాన రకాల పంటలు సాగు చేసే విస్తీర్ణంలో సాగు భూమి ఉండగా, ఇందులో 2.78 హెక్టార్లు ఖరీఫ్‌లోనూ, మిగిలినవి రబీలో జిల్లా రైతులు సాగు చేస్తారు.

లో దుక్కులు ఎందుకు?

పంటలు లేని వేసవిలో చీడపీడలు..తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమిపొరల్లోకి వెళ్తాయి. వరి, మిరప, ప్రత్తి, కంది తదితర పంటలకు ఆశించే రసంపీల్చే పురుగులు, వివిధ రకాల తెగుళ్ల గులాబీ పురుగులు, నల్లతామర, పచ్చపురుగు, లద్దెపురుగులు వంటివి భూమిలో దాక్కొని ఉంటాయి. కాబట్టి 9 అంగుళాలకు తగ్గకుండా దుక్కి వాలుకు అడ్డంగా ట్రాక్టర్లు, ఎద్దుల నాగళ్లతో లోతుగా దున్నుకోవాలి. లో దుక్కులతో పెకలింపబడి, వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రతకు నశించడానికి అవకాశం ఉంటుంది.

నేల గుల్లబారుతుంది

వేసవిలో లోతుగా దుక్కి దున్ని తొలకరి వర్షాలకు గొర్రు తిప్పి గుంటలతో సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలత ఏర్పడుతుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటక, దంతెన వంటి పరికరాలు నేలలోపలికి 3–5 అంగుళాల లోతు వరకు చొచ్చుకొని పోతాయి. లోతు దుక్కితో ఈ గట్టిపొర ఛేదింపబడుతుంది. వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకిపోయి నేల సారవంతం అవుతుంది.

పెరగనున్న పోషక విలువలు

పంటల కోతల తర్వాత నేలపై మిగిలే పంటల మొదళ్లు, పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, అలాగే పంటల నుంచి రాలిపడిన ఆకుల వంటివి లోతు దుక్కి దున్నినపుడు నేలలో కలిసి కుళ్లిపోతాయి. ఫలితంగా నేలలో సేంద్రియ పదార్థాలు, పోషక విలువలు పెరుగుతాయి. ఏడాది పొడవునా నిలువ చేసిన పశువుల ఎరువులను ఎండాకాలంలోనే పొలాల్లోకి తోలుకోవాలి.

భూసారంతోనే అంతా..



గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా సాధారణ సాగు విస్తీర్ణం కంటే తగ్గింది. ఈ ఏడాది ముందస్తుగానే ఋతుపవనాలు వస్తున్నందున జిల్లా సాగు విస్తీర్ణం పూర్తి అవుతుందని భావిస్తున్నాం. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువులు, విత్తనాల సాగు అవసరాలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదించాం.

–ఐ మురళీ,
పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి

భూసారంపైనే ఆధారం



భూసారం బాగుంటేనే పంట నాణ్యత, అధిక దిగుబడులు వస్తాయి. ఇందుకు లోతు దుక్కులు ఎంతో దోహదపడతాయి. దుక్కులు 25–30 సెంటీమీటర్ల లోతులో చేసుకోవడం వల్ల భూమిలోకి గాలి లభ్యత, సూక్ష్మజీవుల సాంద్రత పెరుగుతాయి. ముఖ్యంగా మట్టిపరీక్షలకు అనువైన పంటల్ని ఎంపిక చేసుకోవాలి.

–సీహెచ్ సరిత,
ఏవో యడ్లపాడు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



గణపవరంలో ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

నాదెండ్ల: గణపవరం శాంతినగర్‌లో కొలువైయున్న శ్రీ గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 26వ ఆరాధనా మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ నెల 16న ప్రారంభమై గురు, శుక్రవారాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జెండా గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం ఆలయ శుద్ధి నిర్వహించి స్వామివార్లను నూతన వస్త్రాలతో అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం చేశారు. ముగింపు సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం 5 గంటలకు ఆలయం వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాన పఠనం నిర్వహించారు. రాత్రి గణపవరం నాగరాజ భజన సమాజం వారిచే భజనా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు మొలకాగురునాథం,కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు ముగిశాయి. చివరి రోజున స్వామి వారికి అర్చకులు కనగాల వసంతాచార్యులు ఆధ్వర్యంలో విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తసమాజం ఆధ్వర్యంలో సామాజిక భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆరాధనోత్సవాలకు హాజరైన భక్తులకు గ్రామపెద్దల సహకారంతో అన్నదానం నిర్వహించారు.

144వ సెక్షన్ అతిక్రమిస్తే కఠిన చర్యలు

సత్తెనపల్లి: పట్టణంలో 144 సెక్షన్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం చోటు చేసుకుంటున్న అల్లర్ల నేపథ్యంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపట్టిన 144 సెక్షన్ శనివారం 4వ రోజుకు చేరింది. పట్టణంలో పాలు, కూరగాయలు, మెడికల్ షాపులు మినహా మిగిలిన అన్ని దుకాణాలను మూసివేశారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ అనవసరంగా రోడ్లపై తిరగవద్దని, నలుగురికి మించి ఒకే చోట గుమ్మి కూడినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించిన పలువురిపై కేసులు నమోదు చేశారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

అమరావతి: ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే పత్తి, మిర్చి, ఇతర పంటల విత్తనాలను అధిక రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి అహ్మద్ శనివారం హెచ్చరించారు. స్టాకు రిజిస్టర్, బిల్లు పుస్తకాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కలుపు మందు తట్టుకునే బీటీ విత్తనాల అమ్మకానికి అనుమతి లేదన్నారు. ఈ విత్తనాలను అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవన్నారు. విత్తనాల, ఎరువుల స్టాకు పట్టికను ప్రతి రోజు బోర్డులో రాయాలని సూచించారు. రసీదులు లేకుండా విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముప్పాళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. మండలంలోని గోళ్లపాడు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో నకరికల్లు మండలం చేజర్లకు చెందిన షేక్ షరీఫ్(24) గాయపడి నరసరావుపేటలోని ఏరియా వైద్యశాలో ప్రాథమిక చికిత్స పొందాడు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రవేటు వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.హజరతయ్య తెలిపారు.